E69 NEWS
తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం :
9959812941-9949356387

PUBLISHED: TELANGANA | సంపుటి :01 | సంచిక :172 | సోమవారం 01 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-

# ఆరుగురు పిల్లలుంటే ఓటు హక్కు కట్!

## యూపీలో ఈసీ సొంత నిబంధనలు



2 లో

న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31 ఆరుగురు అంతకన్నా ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న పౌరుల ఓటు హక్కును తొలగించ వచ్చా? అంటే తొలగించవచ్చుననే అంటున్నారు యూపీలోని ఎన్నికల అధికారులు. మీకు ఆరుగురు పిల్లలున్నారా అంటూ ఈసీ ఈ ఏడాది జనవరి 6న వారణాసి కంటోన్మెంట్ పరిధిలోని సోనుగిరీ (35)కి నోటీస్ పంపింది.

# ఇచ్చిన హామీలు అమలు చేయకుండా

## ఢిల్లీలో నాటకాలు ఎందుకు రాహుల్ జీ? : కేటీఆర్


2 లో

న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31 మనం సర్వనాశనం అయిపోతున్నాం.. కానీ మనబాధను వినేవారెవరూ లేరని ఓ ఆటోడ్రైవర్ తనతో చెప్పిన మాటల్ని రాహుల్ గాంధీ ఎక్స్ లో పేర్కొన్నారు. సీఎన్జీ నుండి ఎల్పీజీ గ్యాస్ వరకు, పిల్లల చదువుల నుండి వైద్యం వరకు, పాల నుండి వంట నూనెల వరకు ప్రతి వస్తువుపై పెరుగుతున్న ఒక్కో రూపాయి పేదల బడ్జెట్‌ను, వారి వంటగదిని నేరుగా దెబ్బతీస్తోందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ పోస్ట్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా.. రాహుల్ గాంధీ ఢిల్లీలో నాటకాలు వేస్తున్నారని ఆరోపించారు. గత 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన వాగ్దానాలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు.

# కాళేశ్వరంలో భక్త జనసందోహం

## నేటితో ముగియనున్న సరస్వతీ అంత్య పుష్కరాలు


2 లో

న్యూస్ డెస్క్,తెలుగు గళం న్యూస్ మే/ 31 జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం నిర్వహిస్తున్న సరస్వతీ పుష్కరాలు సోమవారంతో ముగియనున్నాయి. చివరిగా ఆదివారం సెలవు రోజు కావున భక్తులు అధిక సంఖ్యలో పుష్కర స్నానాలు చేసారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర ఆలయంలో భక్తుల రద్దీతో, శివ నామస్మరణతో మార్మోగుతోంది

# రైతులకు శుభవార్త

## సాగునీటిని విడుదల చేసిన ప్రభుత్వం!


2 లో

న్యూస్ డెస్క్,తెలుగు గళం న్యూస్ మే/ 31 తూర్పుగోదావరి జిల్లాలోని ధవలేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి డెల్టా రైతులకు శుభవార్త అందింది. ఖరీఫ్ సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని గోదావరి డెల్టా పరిధిలోని ప్రధాన కాలువలకు సాగునీటిని అధికారులు విడుదల చేశారు. ప్రతి ఏడాది నిర్ణీత తేదీతో పోలిస్తే.. ఈసారి ఒక రోజు ముందుగానే సాగునీటిని విడుదల చేయడం విశేషం. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ధవలేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి కాలువల్లోకి నీటిని విడుదల చేశారు.

# అభిషేక్ బెనర్జీపై దాడిని ఖండించిన రాహుల్


2 లో

న్యూస్ డెస్క్,తెలుగు గళం న్యూస్ మే/ 31 పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతూ తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత, ఎంపీ అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి ఉదంతం దేశవ్యాప్తంగా రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్ ప్రాంతంలో ఎన్నికల అనంతర హింస బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన తరుణంలో ఆయనపై ఈ దాడి జరగడం గమనార్హం. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా, 'ఇండియా' కూటమి నేతలు ముక్తకంఠంతో స్పందించారు. శనివారం సోనార్‌పూర్ పర్యటనలో ఉన్న సమయంలో కొందరు దుండగులు ఒక్కసారిగా అభిషేక్ బెనర్జీ కాన్వాయ్ లక్ష్యంగా రాళ్లు, గుడ్లు విసిరి బీభత్సం సృష్టించారు. ఈ దాడిలో తనకు తృటిలో పెద్ద ప్రమాదం తప్పిందని, అయితే రాళ్లు తగలడం వల్ల తన కంటిపై గాయమైందని అభిషేక్ బెనర్జీ స్వయంగా వెల్లడించారు. ఈ దారుణానికి సంబంధించిన దృశ్యాలన్నీ వీడియోలో స్పష్టంగా రికార్డయ్యాయని, పక్కా ఆధారాలు ఉన్నందున ఈ ఉదంతంపై తాము న్యాయపోరాటం చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కాగా కూటమి భాగస్వామ్య పక్ష నేతపై జరిగిన ఈ భౌతిక దాడిని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అత్యంత తీవ్రంగా పరిగణించింది. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడిని రాహుల్ గాంధీ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ప్రజా సమస్యలపై వెళ్తున్న నాయకులను భయభ్రాంతులకు గురిచేసే ఇలాంటి చర్యలు దురదృష్టకరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడి పర్యటనకు తగిన భద్రత కల్పించడంలో వైఫల్యం చెందడం వెనుక రాజకీయ కక్షసాధింపు ధోరణి స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలను పక్కనబెట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే బెంగాల్ మాజీ సీఎం, తృణమూల్ పార్టీ అధినేత మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.




- మరో మూడు రోజులు మంటలు
- ఆరెంజ్ అలర్ట్ జారీ
- 28 జిల్లాల్లో వడగాల్పులు
- 45.4 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత
- వడదెబ్బకు 13 మంది బలి
- జూన్ 10 తర్వాతే వర్షాలు
- అప్పటివరకు ఎండలే రాజ్యం

న్యూస్ డెస్క్,తెలుగు గళం న్యూస్ మే/ 31 తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా భానుడు భగ్గుమంటున్నాడు. జూన్ మూడో తేదీ వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగుతుందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాబోయే రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ తీవ్రమైన ఉష్ణోగ్రతలు, వేడి గాలుల దృష్ట్యా రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా వచ్చే నాలుగు రోజుల్లో జిల్లాల వారీగా ఎండల ప్రభావం తీవ్రంగా ఉండనుందన్నారు. మే 31న అత్యధికంగా 28 జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని, జూన్ ఒకటిన 11 జిల్లాలు, జూన్ రెండున 12 జిల్లాలు, అలాగే జూన్ మూడో తేదీన 17 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

శనివారం నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో 45.4 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో 45.3 డిగ్రీలు, ములుగు జిల్లా మంగపేటలో 45.2 డిగ్రీలు, నిర్మల్ జిల్లా మామడలో 45.2 డిగ్రీలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలో 45 డిగ్రీల సెల్సియస్ చొప్పున భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళల్లో జనం బయటకు రావడానికే భయపడే పరిస్థితి నెలకొంది. రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి.

మిగతాది 2 లో..

# బాసర నుంచి భద్రాచలం వరకు

## ఆలయాల కోసం వెయ్యి కోట్లు విడుదల చేశాం

### : మంత్రి పొంగులేటి


2 లో

# చార్ ధామ్ యాత్రకు భారీగా పోటెత్తిన భక్తులు

## 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్


2 లో

# ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఢిల్లీలో నాటకాలు ఎందుకు రాహుల్ జీ? : కేటీఆర్

మొదటి పేజీ తరువాయి



"ఢిల్లీలో కొత్తగా పెద్ద పెద్ద వాగ్దానాలు చేసే ముందు.. గత 2023లో తెలంగాణ ఆటో డ్రైవర్లకు మీరు ఇచ్చిన హామీలు ఏమయ్యాయో దయచేసి కాస్త వివరిస్తారా? నాడు ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా ఒక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, అలాగే ప్రతి డ్రైవర్‌కు ఏటా రూ.12,000 ఆర్థిక సహాయం అందిస్తామని మీరు స్పష్టమైన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 30 నెలలు గడిచిపోయినా.. ఇప్పటివరకు వాటిలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా మీరు నెరవేర్చలేదు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ఇప్పటివరకు ఆర్థిక ఇబ్బందులు తాళలేక దాదాపు 100 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుని ప్రాణాలు కోల్పోయారు. మూడేళ్ల క్రితం తెలంగాణ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలే ఇంకా పెండింగ్‌లో పెట్టుకుని.. ఇప్పుడు మళ్లీ ఢిల్లీలో ఈ కొత్త రాజకీయ నాటకాలు దేనికి?" అంటూ కేటీఆర్ నిలదీశారు.

# బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల కోసం వెయ్యి కోట్లు విడుదల చేశాం: మంత్రి పొంగులేటి



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాల అభివృద్ధి కోసం మొదటి విడతలో రూ.1000 కోట్లు విడుదల చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం భద్రాచలానికి ఒక్క పైసా ఇవ్వలేదని, కానీ ప్రజా ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. మేడారం జాతరను అద్భుతంగా నిర్వహించడమే కాకుండా.. రూ.300 కోట్లతో మేడారాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. కూసుమంచిలోని చారిత్రాత్మక శివాలయం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందన్నారు. అన్ని మతాలను సమానంగా చూస్తూ మతాలకు అతీతంగా ఆలయాలు, చర్చిలు, మసీదులను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు జరుగుతుంటే, కొన్ని పార్టీలు మాత్రం దేవుడి గుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. మాటలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో నిధులు కేటాయిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.

# చార్ ధామ్ యాత్రకు భారీగా పోటెత్తిన భక్తులు 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** చార్ ధామ్ యాత్రకు భక్తులు పోటెత్తుతున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. జోషీమఠ్–మార్వారీ మార్గంలో 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీకెండ్, సెలవు దినాలు కావడంతో కేదార్ నాథ్, గోవింద్ ఘాట్స్, జోషిమఠ్ సమీపంలోని బద్రీనాథ్ మార్గం అదే విధంగా కేదార్ నాథ్ వెళ్లే సోన్ ప్రయాగ్ లాంటి మార్గాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనాలు బారులు తీరడంతో యాత్రికులు గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. సరైన ఆహారం, నీళ్లు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు.

దీంతో అధికారులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుఉ ప్రయత్నిస్తున్నారు. ట్రాఫిక్ ను నియంత్రించేందు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. భక్తుల రద్దీ పెరగటంతో చార్ ధామ్ వెళ్లే భక్తులు ముందుగానే రద్దీని దృష్టిలో పెట్టుకుని, వాతావరణ పరిస్థితులు తెలుసుకుని ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే చార్ ధామ్ యాత్ర హిందూ మతంలోని పవిత్రమైన పుణ్యక్షేత్రాల ప్రయాణం అని చెబుతుంటారు. చార్ ధామ్ అంటే హిమాలయాల్లోని నాలుగు పవిత్ర స్థలాలను దర్శించుకోవడం అని అర్థం. ప్రతి ఏడాది ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటివారంలో ఈ యాత్ర ప్రారంభం అవుతుంది. అక్టోబర్ చివరలో లేదా నవంబర్ లో పూర్తవుతుంది.

# భగ్గుమంటున్న భానుడు మరో మూడు రోజులు మంటలు

మొదటి పేజీ తరువాయి




ఉష్ణోగ్రతలతో పాటు వేడి గాలులు తోడవడంతో సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రాకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వడదెబ్బ తగలకుండా తగినన్ని నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, కొబ్బరినీళ్లు వంటి ద్రవాహారాలను నిరంతరం తీసుకుంటూ ఉండాలన్నారు. ప్రయాణాలు చేసే వారు తప్పనిసరిగా గొడుగులు, టోపీలు, కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన ఈ ఎండల తీవ్రత శనివారం పెద్ద విషాదాన్ని మిగిల్చింది. వివిధ ప్రాంతాల్లో వడదెబ్బకు గురై వేర్వేరు జిల్లాల్లో మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదుగురు వడదెబ్బ కారణంగా కన్నుమూశారు. అలాగే కరీంనగర్ జిల్లాలో ముగ్గురు, నల్గొండ జిల్లాలో ముగ్గురు మరణించగా,, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు.

నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కీలక అప్‌డేట్ ఇచ్చింది. శనివారం నాటికి అరేబియా మహాసముద్రంతో పాటు లక్షద్వీప్, ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరించాయని అధికారులు తెలిపారు. రాబోయే ఐదు రోజుల్లో కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను తాకడానికి వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ఇవి కేరళను తాకిన తర్వాత మన రాష్ట్రానికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం జూన్ 10వ తేదీ తర్వాతే రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు. అప్పటివరకు ఈ ఎండల తీవ్రత, ఉక్కపోత భరించక తప్పదని, ప్రజలంతా స్వీయ జాగ్రత్తలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కాళేశ్వరంలో భక్త జనసందోహం.. నేటితో ముగియనున్న సరస్వతీ అంత్య పుష్కరాలు

మొదటి పేజీ తరువాయి

సోమవారం చివరి రోజు శివుడికి ప్రీతికరమైన రోజు కూడా కావున విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తమయ్యారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

పుష్కర ఘాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఎండల నుంచి రక్షణ చర్యలు తదితర అంశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. రద్దీ ఉండే ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో వాహనాలు రద్దీ, ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వాహనాలు క్రమబద్ధీకరణ, రద్దీ నియంత్రణకు పోలీసు, రవాణా, దేవాలయంలో భక్తులు క్యూ పాటించడం, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎండ దృష్ట్యా భక్తులు తెల్లవారుజాము నుంచే త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించి స్వామి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన విధుల్లో అందుబాటులో ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

# రైతులకు శుభవార్త.. సాగునీటిని విడుదల చేసిన ప్రభుత్వం!

మొదటి పేజీ తరువాయి



ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గోదావరి జలాలకు పూజలు నిర్వహించిన అనంతరం కాలువ గేట్లను ఎత్తి సాగునీటిని విడుదల చేశారు. అధికారుల వివరాల ప్రకారం.. గోదావరి డెల్టా పరిధిలోని సుమారు 10 లక్షల 13 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలోని రైతులు ఈ నీటి విడుదలతో ప్రయోజనం పొందనున్నారు.

సాగునీరు ముందుగానే విడుదల కావడంతో రైతులు ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఏర్పాట్లు వేగవంతం చేసుకునే అవకాశం లభించింది. ఈ నిర్ణయం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. 'రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం. గోదావరి డెల్టా పరిధిలోని ప్రతి ఎకరాకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

# ఆరుగురు పిల్లలుంటే ఓటు హక్కు కట్! యూపీలో ఈసీ సొంత నిబంధనలు

మొదటి పేజీ తరువాయి

అతను అవునని సమాధానం ఇవ్వడంతో తుది జాబితాలో అతని పేరును తొలగించారు. ఇలాంటి కారణంతో నియోజకవర్గంలోని 20 బూత్‌ల పరిధిలో వేలాది మంది పేర్లను తొలగించినట్టు నేషనల్ హెరాల్డ్ తన అధ్యయనంలో పేర్కొంది.

ఇలా తొలగించిన ఓటర్లను 'క్యూ' కేటగిరీలో చేర్చారు. అలాగే తాతయ్య, అమ్మమ్మల వయసుకు, ఓటరు వయసుకు మధ్య 40 ఏండ్ల కన్నా తక్కువ తేడా ఉన్నా, ఓటరుకు, వారి తల్లిదండ్రుల మధ్య 15 ఏండ్ల లోపు వ్యత్యాసం ఉంటే ఆ వ్యక్తి ఓటును తొలగించారు. యూపీ మాజీ ప్రధాన ఎన్నికల అధికారి నూర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపట్టిన సర్ ప్రక్రియ అనుమానాస్పదంగా ఉన్నదని, అర్థం లేని కారణాలు చూపి వేలాది మంది ఓట్లను తొలగించినట్టు కనిపిస్తున్నదని, దీనిని తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీల కలకలం.. స్పందించిన బీజేపీ చీఫ్



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు వ్యతిరేకంగా హైదరాబాద్ లో పలు చోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం కలకలం రేపుతోంది. ఈటల నవ్వు బీజేపీలో చేరి చేసిందేంటయ్యా.. అంటూ ఈ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈటల బీజేపీలో చేరి గ్రూపులు కడుతున్నాడంటూ ఆ ఫ్లెక్సీలలో పేర్కొన్నారు. పార్టీలో గ్రూపులు కట్టి ఇతరులను ఎదగనివ్వకుండా చేస్తున్నారని ఆరోపించారు. కాగా ఈటలపై దుష్ప్రచారాన్ని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఖండించారు. ఈటల బండి సంజయ్ కి తనకు మధ్య గొడవలు పెడుతున్నారు అనేదానిలో నిజం లేదని చెప్పారు.

ఇదే అంశంపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సైతం స్పందించారు. తెలంగాణలో బీజేపీ బలం పెరుగుతోందని ఓర్వలేకనే ఇతర పార్టీలకు చెందిన నేతలు, బయట వ్యక్తులు ఇలాంటి పనులు చేస్తున్నారని చప్పారు. బీజేపీలో ఎలాంటి విభేదాలు లేవని అన్నారు. తమ పార్టీ నేతల మధ్య చిచ్చు పెట్టాలని కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈటలకు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినవాళ్లపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ నేతలు ఐక్యంగా పనిచేస్తున్నారని, అందుకే పార్టీ గ్రాఫ్ పెరిగిందన్నారు.

# జంబులయ్య వైసీపీ కార్యకర్తే : జగన్ పై మంత్రి లోకేష్ ధ్వజం



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన జంబులయ్య వైఎస్సార్సీపీకి చెందిన వ్యక్తేనన్నారు. గొడ్డలి పార్టీ కార్యకర్తలను సైకో జగన్ రంగంలోకి దింపారని ఆరోపించారు. జగన్నాటకాలు చూసి జనం ఛీ కొట్టినా, డ్రామాలు మానడం లేదని ఎద్దేవా చేశారు. జగన్ ఎన్నిసార్లు దొరికిపోయినా కుట్ర, క్షుద్ర రాజకీయాలు మానరా అని మంత్రి లోకేష్.. వైసీపీపై ధ్వజమెత్తారు. బాబాయి గుండెపోటు, కోడికత్తి, గులకరాయి నాటకాల రాయుడు జగన్.. గొడ్డలి పార్టీ కార్యకర్తల్ని రంగంలోకి దింపాడని ఆరోపిస్తున్నారు.

# బీజేపీ ఒక్క సీటు గెలిచినా రాజకీయాలు వదిలేస్తా కమ్యూనిస్టుల కంచుకోటపై కూనంనేని ధీమా



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** తెలంగాణ రాజకీయాలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలపై, రాబోయే ఎన్నికల్లో కమ్యూనిస్టుల వ్యూహాలపై అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో బీజేపీ గెలుపుపై ఆయన విసిరిన సవాల్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎప్పటికీ అధికారంలోకి రాలేదని కూనంనేని సాంబశివ రావు స్పష్టం చేశారు. కేవలం సెంటిమెంట్, భావోద్వేగాలను రెచ్చగొట్టే రాజకీయాలు మాత్రమే బీజేపీకి వచ్చని, కానీ అలాంటి విన్యాసాలు తెలంగాణలో అస్సలు పనిచేయవని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఒకవేళ ఖమ్మంలో బీజేపీ ఒక్క సీటైనా గెలిస్తే.. నేను ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పి.. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటాను" అంటూ కూనంనేని సంచలన సవాల్ విసిరారు.

పొత్తులపై పంథా మారుస్తాం..

వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టుల పొత్తుల వ్యూహం పూర్తిగా మారబోతోందని కూనంనేని వెల్లడించారు. "ఇకపై ఒకటి, రెండు సీట్లు ఇచ్చే పార్టీలతో మేము పొత్తులు పెట్టుకునే ప్రసక్తే లేదు. గౌరవప్రదంగా కనీసం ఐదు సీట్లకు తగ్గకుండా ఇచ్చే పార్టీలతోనే రాబోయే ఎన్నికల్లో పొత్తులు ఉంటాయి" అని ఆయన తేల్చి చెప్పారు. ఎన్నికల సమయంలో మినహా, మిగిలిన అన్ని సమయాల్లో కమ్యూనిస్టులంతా (సీపీఐ, సీపీఎం తదితర శ్రేణులు) ఎప్పుడూ కలిసే ఉంటామని, ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాడతామని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజలకు ఉపయోగపడే, ప్రజా శ్రేయస్సు కోరే రాజకీయాలు మాత్రమే చేస్తారని కూనంనేని గుర్తుచేశారు. వ్యక్తిగత స్వార్థం, లాభాల కోసం కమ్యూనిస్టులు ఎన్నడూ రాజకీయం చేయరని.. ఒకవేళ ఎవరైనా తమ స్వార్థం కోసం రాజకీయం చేయాలని చూస్తే, వారు కమ్యూనిస్టు పార్టీలో కొనసాగడానికి ఎంతమాత్రం అర్హులు కారని ఆయన గట్టిగా హెచ్చరించారు.


# అలా చేయలేకపోతే ఎన్నికల నుంచి తప్పుకుంటారా? : సీఎంకు కేటీఆర్ కౌంటర్



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** ఎన్నికల సమయంలో.. తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని, అలా చేయలేకపోతే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ కు ఆ మాట చెప్పే ధైర్యం ఉందా? అని సవాల్ చేశారు. ఆదివారం.. నగరంలోని క్లాసిక్ గార్డెన్లో బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గస్థాయి విస్తృత సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకూ హైదరాబాద్ లో ప్రజల కోసం ఒక్క ఇల్లైనా కట్టారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చేసేది చెప్పరు.. చెప్పింది చేయరని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులకు రిబ్బన్ కట్ చేసి.. ఆ క్రెడిట్ అంతా తమ ఖాతాలో వేసుకుంటున్నారని యద్దేవా చేశారు.

కంటోన్మెంట్ ఉపఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చి.. 6 వేల ఇళ్లు ఇస్తామని చెప్పారని.. ఇప్పటి వరకూ 6 ఇళ్లయినా కట్టారా? అని నిలదీశారు. దేశం మొత్తం కాంగ్రెస్ ను వదిలించుకుంటే.. తెలంగాణలో మాత్రం నెత్తిన పెట్టుకోవాల్సి వచ్చిందని వాపోయారు. సీఎం కాకముందు రైతులకు 3 గంటల కరెంట్ చాలన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తామనడం వెనుక ఆంతర్యమేదో ఉందన్నారు. కేసీఆర్ హయాంలో తాము మేం 24 గంటల ఉచిత విద్యుత్ ఇచ్చామని గుర్తుచేశారు. రేవంత్ ప్రభుత్వం ఇచ్చేది రైతు డిస్కం కాదని.. రైతును చంపే డిస్కం అని ఆరోపించారు. కేసీఆర్ అప్పుచేసి సంక్షేమ పథకాలు చేపట్టారని, రేవంత్ రూ.4 లక్షల కోట్ల అప్పు చేసి ఏం చేశారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతుబంధు లేదు కానీ.. రాహుల్ బంధు నడుస్తోందని విమర్శించారు.

# రణరంగంగా మారిన పారిస్.. ఒకరు మృతి, 780 మంది అరెస్ట్



**న్యూస్ డెస్క్, తెలుగు గళం న్యూస్ మే/ 31** ఛాంపియన్స్ లీగ్ ఫైనల్‌లో పీఎస్‌జీ జట్టు ఘన విజయం సాధించిన ఆనందం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఎంతోసేపు నిలవలేదు. అభిమానుల విజయోత్సవాలు కాస్తా క్షణాల్లో తీవ్ర హింసాత్మకంగా మారాయి. పారిస్ వీధుల్లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున అల్లర్లకు దిగడంతో సిటీ వ్యాప్తంగా టెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ అలర్లను అదుపు చేసే క్రమంలో లా అండ్ ఆర్డర్ ఉల్లంఘించిన 780 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. పీఎస్‌జీ విజయం తర్వాత వేలాది మంది అభిమానులు, ఆందోళనకారులు పారిస్ వీధుల్లోకి దూసుకువచ్చారు. సీన్ నది తీరంలో ఉన్న పలు ప్రాంతాల్లో అల్లరి మూకలు పెద్ద ఎత్తున నిప్పు పెట్టారు. అదేవిధంగా ఫుట్‌బాల్ అభిమానులు భారీ సంఖ్యలో పొగ బాంబులు, బాణసంచా కాల్చడంతో పారిస్ స్కైలైన్ మొత్తం దట్టమైన పొగతో నిండిపోయింది. ప్రసిద్ధ ఐఫిల్ టవర్ సైతం ఈ పొగ కారణంగా పాక్షికంగా కనిపించకుండా పోయింది.మరోవైపు ఈ విజయోత్సవాల వేళ నగరంలో తీవ్ర కూడా చోటుచేసుకుంది. పారిస్ రింగ్ రోడ్డుపై వేగంగా ప్రయాణిస్తున్న ఓ పీఎస్‌జీ టీమ్ సపోర్టర్, అక్కడే ఉన్న కాంక్రీట్ బ్లాక్‌ను స్కూటర్‌తో బలంగా ఢీకొట్టాడు. ఈ ఘోర ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన సదరు అభిమాని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

పోలీసులపై దాడులు.. రికార్డు స్థాయిలో అరెస్టులు

పరిస్థితిని అదుపు చేయడానికి రంగంలోకి దిగిన భద్రతా దళాలపై అల్లరి మూకలు రాళ్లు, బాణసంచాతో దాడులకు తెగబడ్డారు. ఈ ఘర్షణల్లో పలువురు పోలీసు అధికారులు గాయపడ్డారు. పరిస్థితి చేదాటి పోకుండా చూసేందుకు పోలీసులు లాఠీఛార్జ్ చేసి, ఉద్రిక్తతలకు కారణమైన 780 మందిని అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది జరిగిన ఘర్షణల్లో 592 మందిని అరెస్ట్ చేయగా, ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పెరగింది. అలర్ల వేళ ప్రారంభంలో 130 మంది అరెస్ట్ కాగా, అల్లర్లు ముదరడంతో ఆ సంఖ్య 780కి చేరింది. ప్రస్తుతం నగరంలో అదనపు బలగాలను మోహరించామని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని ఫ్రాన్స్ అంతర్గత వ్యవహారాల మంత్రి మీడియాకు తెలిపారు.

## లేబర్తి ఆకేరు వాగుపై బ్రిడ్జి పనులు నత్తనడకన--గ్రామస్తుల ఆగ్రహం

### ●వెంటనే పూర్తి చేయాలని డిమాండ్





తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట మే 31

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం లేబర్తి గ్రామం నుండి జగ్నా తండా వరకు ఆకేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోవడంతో స్థానిక ప్రజలు, రైతులు, గౌడ్ లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శించారు. బ్రిడ్జి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని పేర్కొన్నారు. గ్రామస్తుల వివరాల ప్రకారం, ఈ బ్రిడ్జి నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయని, అప్పట్లో పనులు ప్రారంభమై కొంత మేరకు పురోగతి సాధించాయని తెలిపారు. అయితే ప్రభుత్వం మారిన తర్వాత మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రైతులు తమ పంటలను తరలించడంలో, విద్యార్థులు పాఠశాలలు మరియు కళాశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ప్రజల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.వర్షాకాలానికి ముందే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## సఫాయి కార్మికుల సేవలు మరువలేనివి

### -- ప్రజారోగ్య పరిరక్షణలో మరోసారి నిబద్ధత

తెలుగు గళం న్యూస్ జనగామ, మే 31

జనగామ పట్టణంలోని రెండవ వార్డు పరిధిలోని కెమిస్ట్రీ భవన్--నెల్లుట్ల శ్రీనివాస కాలనీ సరిహద్దు ప్రాంతంలో నాలుగు రోజుల క్రితం చనిపోయిన ఒక వరాహం (పంది), ఒక శునకం (కుక్క) కుళ్లిపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ స్థానిక ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాయి. పురుగులు పడి కాలేబరాలు పగిలిపోవడంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక పెద్ద ఫకీర్ యాదగిరి రెడ్డి, మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ గోపయ్య, రెండవ వార్డు ఏరియా జవాన్ రాజులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు కేవలం అరగంటలోనే సఫాయి కార్మికులను సంఘటన స్థలానికి పంపించారు. భరించలేని దుర్వాసన, పురుగులతో నిండిన పరిస్థితుల్లోనూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సఫాయి కార్మికులు చనిపోయిన జంతువుల కాలేబరాలను తొలగించి పరిసర ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మున్సిపల్ సఫాయి కార్మికుల సేవలను ప్రశంసిస్తూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ విధులను నిర్వర్తిస్తున్న సఫాయి కార్మికుల త్యాగం, సేవాస్ఫూర్తి సమాజానికి ఆదర్శమని కొనియాడారు. "సఫాయి కార్మికుల సేవలను గుర్తిద్దాం... వారిని గౌరవిద్దాం..." అని స్థానికులు పిలుపునిచ్చారు.







## ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా

## రాపర్తి రాజు రెండవసారి ఎన్నిక

- ●జిల్లా నుండి రాష్ట్ర కమిటీ సభ్యులుగా
- ●భైరగొని బాలరాజు, గజ్వేల్లి రమేష్
- ●మహాసభల జయప్రదానికి సహకరించిన వారందరికీ అభినందనలు



ఆల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా
రాపర్తి రాజు ఎన్నిక

తెలుగు గళం న్యూస్ జనగామ మే31

జనగామ పట్టణంలో జరిగిన అల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర నాలుగవ మహాసభలలో రాపర్తి రాజు రెండవసారి రాష్ట్ర కార్యదర్శిగా రాష్ట్ర కమిటీ సభ్యులుగా భైరగొని బాలరాజు గజ్వేల్లి రమేష్ లు ఎన్నికైనారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సిఐటి యు కార్యాలయంలో రాపర్తి రాజు మాట్లాడుతూ.. జనగామ పట్టణంలో జరిగిన ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) మహాసభలు విజయవంతంగా జరిగాయి అని ఈ మహాసభలకు సహకరించిన సిఐటియు రాష్ట్ర జిల్లా నాయకత్వానికి ప్రజా సంఘాల నాయకులకు కార్మికులకు శ్రేయోభిలాషులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు రాపర్తి రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ హమాలి కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యల పైన రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన 30 జిల్లాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారని చర్చల ఆధారంగా భవిష్యత్ పోరాటాలకు 12 కర్తవ్యాలు అరు తీర్మానాలను మహాసభ ఆమోదించిందని పేర్కొన్నారు. తీర్మానాలకు సంబంధించి 1 కేంద్ర బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ను అమలు చేసేందుకు తెచ్చిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయాలి తెలంగాణ రాష్ట్రంలో లేబర్ కోడ్స్ ను అమలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలి. 2 రాష్ట్రంలో ఏడు లక్షల హమాలి కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందించాలి. 3 కార్మిక వర్గ ఐక్యతను విచ్చినం చేసే మతోన్మాద చర్యలను వ్యతిరేకిస్తూ మతసామరస్యాన్ని కాపాడుకునేందుకు ఉద్యమించాలి. 4 కార్మిక పోరాటాల పై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధాన్ని ఆపాలి ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి. 5 రాష్ట్రంలో కోటి మందికి పైగా ఉన్న అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అమలు చేయాలి. 6 సామాజిక ఉద్యమాలకు అండగా నిలబడదాం..

ఈ ఆరు తీర్మానాలను మహాసభ ఆమోదించిందన్నారు. భవిష్యత్తులో ఈ తీర్మానాల అమలు కోసం పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ మహాసభలకు సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ రాష్ట్ర నాయకులు హాజరై మహాసభలో హమాలి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఉద్యమాలకు దిశ నిర్దేశం చేస్తూ ప్రసంగించారు. ఈ మహాసభలో 65 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారని జనగామ జిల్లా నుండి ముగ్గురికి ప్రాతినిధ్యం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



రాష్ట్ర కమిటీ సభ్యులుగా భైరగోని బాలరాజు
(రఘునాథ పల్లి మండలం)



రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గజ్వేల్లి రమేష్
(బచ్చన్నపేట మండలం)

## వేంసూరు లో విఓఏ ల విన్నూత్న నిరసన

### ●14 వ రోజుకు చేరిన సమ్మె



వేంసూరు, మే 31 (తెలుగు గళం) న్యూస్: ఖమ్మంజిల్లా వేంసూరు మండల కేంద్రం లోని మండల కార్యాలయాల ఎదుట విఓఏ లు చేస్తున్న నిరవధిక సమ్మె ఆదివారంతో పద్నాలుగో రోజుకు చేరింది. ఆందోళనకు ఆదివారం సెలవు కాదంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ సమ్మె శిబిరం వద్ద మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆట ఆడుతూ పాట పాడుతూ ప్రభుత్వానికి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో: కాటూరి మణి,వరకా శృంగారం,శేషు కుమారి, కిన్నెర సుగుణ, సీతారత్నం, సునీత, పుష్ప, పిల్లి జ్యోతి, బి.జయమ్మ, రత్నకుమారి, అల్లి మల్లీశ్వరి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు హెచ్చరిక

## జూన్ 4 వరకు తీవ్ర వడగాల్పులు

- ▸▸మధ్యాహ్నం వేళల్లో బయటకు రావద్దు
- ▸▸కూడ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి సూచన
- ▸▸ఉష్ణోగ్రతలు 55 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం జాగ్రత్తలు తప్పనిసరి



తెలుగు గళం న్యూస్ ఆత్మకూరు మే 31

భానుడి భగభగలకు తోడు క్యుములస్ మేఘాల ప్రభావంతో రాబోయే రోజుల్లో వాతావరణం మరింత ఉక్కపోతగా మారనుంది. ఈ నెల జూన్ 4వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల నుండి ఏకంగా 55 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హన్మకొండ డీసీసీ అధ్యక్షులు, కూడ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ కూడా బహిరంగ ప్రదేశాల్లో కింద తిరగవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.?తీవ్రమైన ఉష్ణోగ్రతల వల్ల అకస్మాత్తుగా ఊపిరాడకపోవడం లేదా అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని, అలాంటి పరిస్థితి వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. విపరీతమైన వేడి వల్ల సెల్ ఫోన్లు పేలిపోయే ప్రమాదం ఉన్నందున సెల్ ఫోన్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలని కోరారు.

## బి.వి.రాఘవులకు రైతాంగ సమస్యలపై మొర




తల్లాడ, మే 31 (తెలుగుగళం) న్యూస్: ఆదివారం ఖమ్మంజిల్లా తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామం వచ్చిన సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ను మాజీ జెడ్పీటీసీ తాతా భాస్కరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు మరియు రైతులు కలిశారు. తమ ప్రాంతంలోని రైతాంగ సమస్యలను బి.వి. రాఘవులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాటిని ఓపికగా విని సంబంధిత స్థాయిలో గల అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో: రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, బండి రమేష్ తదితర నేతలు పాల్గొన్నారు.

## చిన్నారి సాన్వికను ఆశీర్వదించిన మాజీ టిస్కాబ్ చైర్మన్ రవీందర్ రావు

తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే31

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం గ్రామంలో ఆదివారం బండి సుధీర్-మానస దంపతుల కుమార్తె చిన్నారి సాన్విక నూతన వస్త్రాలంకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చిన్నారిని ఆశీర్వదించారు.

కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గజ్జెల శ్రీరాములు,మాజీ ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ మండల సత్యం, బండి సంపత్, మహేందర్, రవీందర్, కంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారిని దీవించిన మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

తెలుగు గళం న్యూస్, ఐనవోలు / మే 31 :

వర్ధన్నపేట నియోజకవర్గం ఐనవోలు మండలం వర్ధన్నపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు & తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మాజీ అధ్యక్షులు కొండేటి శ్రీధర్ నందనం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మండల సత్యం మనవరాలి నూతన వస్త్ర పుష్పలంకరణ వేడుకకు హాజరై చిన్నారిని దీవించి ఆశీర్వదించినారు. వారితో దేవేందర్ రెడ్డి, మహేందర్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బొక్కి చెరువులో పెను విషాదం

## వలకు కాలు చిక్కుకుని మత్స్యకార యువకుడు జలసమాధి

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి



జీవన ఉపాధి కోసం ఆశగా చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఓ మత్స్యకార యువకుడు, ప్రమాదవశాత్తు తాను విసిరిన వలకే కాలు చిక్కుకుని నీటిలో మునిగి ప్రాణాలు విడిచిన అత్యంత హృదయవిదారక సంఘటన కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, రక్షకబట శాఖ (పోలీసుల) కథనం ప్రకారం.. కొత్తపల్లి గోరి మండల కేంద్రానికి చెందిన కట్ల సతీష్ (33), తండ్రి ఆనందం, ముదిరాజ్ కులానికి చెందిన యువకుడు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన సతీష్ చేపలు పడుతూ వచ్చిన అరకొర ఆదాయంతోనే తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రతిరోజూ లాగే ఆదివారం కూడా ఆయన తన జీవన ఉపాధిలో భాగంగా గ్రామ పరిధిలోని 'బొక్కి చెరువు'లో చేపలు పట్టడానికి వెళ్లారు. చెరువులో కొంత లోపలికి దిగి ఉత్సాహంగా వల విసురుతున్న క్రమంలో ఊహించని విధంగా ప్రమాదం ముంచుకొచ్చింది. సతీష్ విసిరిన చేపల వల నీటి అడుగున ప్రమాదవశాత్తు ఆయన కాలుకు గట్టిగా చుట్టుకుపోయింది. వల నుండి తన కాలును విడిపించుకోవడానికి సతీష్ నీటిలో తీవ్రంగా పోరాటం చేసినప్పటికీ, ఆ ప్రాంతంలో నీటి లోతు ఎక్కువగా ఉండటం, వల తాడు గట్టిగా అల్లుకుపోవడంతో ఆయన ఎంత ప్రయత్నించినా నీటిపైకి రాలేకపోయారు. వల బరువుకు నీటి అడుగుకే లాగబడటంతో శ్వాస ఆడక సతీష్ అక్కడికక్కడే జలసమాధి అయ్యారు.ఎంతసేపటికీ సతీష్ ఒడ్డుకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తోటి మత్స్యకారులు, స్థానికులు వెంటనే చెరువులోకి దిగి గాలించగా, వలకు చిక్కుకుని అచేతనంగా పడి ఉన్న సతీష్ మృతదేహం లభ్యమైంది.కుటుంబానికి ఆసరాగా ఉంటూ, రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో ఉన్న యజమాని సతీష్ హఠాన్మరణంతో ఆయన భార్య మౌళిక, ఇద్దరు చిన్నారి కూతుళ్లు ఒక్కసారిగా అనాథలయ్యారు.భర్త శవాన్ని చూసి భార్య మౌళిక, కన్నతండ్రి కోసం చిన్నారి పిల్లలు రోదించిన తీరు ఘటనా స్థలంలో ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే కొత్తపల్లి గోరి సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని చెరువు వెలుపలికి తీయించి,క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంపై మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి పత్రికా ముఖంగా వెల్లడించారు. కష్టపడి పనిచేసే యువకుడు సతీష్ మృతితో కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. దిక్కుతోచని స్థితిలో పడిపోయిన సతీష్ నిరుపేద కుటుంబాన్ని, ఆయన ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, మత్స్యకార సంఘాల అధికారులు తక్షణమే స్పందించి ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు గట్టిగా కోరుతున్నారు.

# హసన్‌పర్తి మహిళ అదృశ్యం.. ఆచూకీ తెలిపాలని పోలీసుల విజ్ఞప్తి

తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే31



హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది.హసన్‌పర్తి గ్రామానికి చెందిన అమంచ రాజేందర్ (72) ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అమంచ రాజేందర్ కుమార్తె తోటం స్వప్న (40), దివంగత భాస్కర్ భార్య, గత నెల 15వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ నెల 25వ తేదీన పొరుగువారి ద్వారా సమాచారం అందడంతో ఆమెకు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. అనంతరం బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీసినా ఎలాంటి సమాచారం లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కనిపించకుండా పోయిన స్వప్న ఎత్తు సుమారు 5.5 అడుగులు, తెలుపు వర్ణం కలిగి ఉంటుంది. ఆమె ఎడమ చేతిపై "భాస్కర" అనే టాటూ, కుడి చేతిపై "త్రిశూల్" టాటూ ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. స్వప్న ఆచూకీ గురించి ఏవైనా వివరాలు తెలిసిన ప్రజలు వెంటనే హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు- ఇన్‌స్పెక్టర్--8712685124, సబ్ ఇన్‌స్పెక్టర్--8712685097, 8712685098, ఎస్‌హెచ్‌ఓ--8712685015.

# అలంకారప్రాయంగా నిలిచిన ఆరోగ్య ఉప కేంద్రం

- ప్రభుత్వ లక్ష్యం నెరవేరని వైనం
- సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, తమ్మడపల్లి (జి) గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్

తెలుగు గళం న్యూస్ జఫర్గడ్ మే 31

గ్రామీణ ప్రాంతాలలో పేదలకు వైద్య సదుపాయాల అందించాలనే ప్రభుత్వ లక్ష్యంతో మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామంలో లక్షలు వెచ్చించి నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం అలంకారప్రాయంగా నిలిచిందని సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, తమ్మడపల్లి (జి) గ్రామ కార్యదర్శి వడ్లకొండ సుధాకర్ అన్నారు.ఆదివారం మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామంలో సిపిఐ పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఆరోగ్య ఉప-కేంద్రంను సందర్శించి ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యం అందించాలని పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పాలకుల, ప్రభుత్వ అధికారుల అలసత్వం వల్ల గ్రామీణ పేదలకు వైద్య సదుపాయాల అందక ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. దీంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం తమ్మడపల్లి (జి) గ్రామంలోని ఉప కేంద్రంలో వైద్య సిబ్బందిని నియమించి ఆరోగ్య సేవలు అందించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు అందక కార్పొరేట్ హాస్పిటల్కు వెళ్లలేక పేదలు కష్టాలపాలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పోసప్పు చేసి ప్రైవేటు హాస్పిటల్ కి వెళ్తే లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ కుటుంబాలను ఆర్థికంగా అప్పులోకి నెట్టు వేస్తున్నారని అన్నారు.దీంతో కుటుంబాన్ని పోషించుకోలేక అప్పుల బాధ తట్టుకోలేక కుటుంబాలు అభద్ర భావంలోకి వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే పాలకులు, ఉన్నతాధికారులు స్పందించే గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ, మండల



నాయకులు వేల్పుల పెద్ద రాములు ఎండి యాకూబ్ పాషా రైతు భ సంఘం మండల అధ్యక్షులు అన్నపు అజయ్ వేల్పుల సోమయ్య అన్నపు విష్ణు ఎండి నోర్నీసా నక్క ఎల్లమ్మ గ్రామస్తులు నారబోయిన లింగయ్య, కురపాటి బిక్షపతి అన్నపు వెంకటమ్మ కూరపాటి నిర్మల అన్నపు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# జగద్గిరిగుట్టలో ఆధ్యాత్మిక వాతావరణంలో యౌమ్-ఎ-ఖిలాఫత్ జల్సా

తెలుగు గళం న్యూస్ జగద్గిరిగుట్ట, మే 31




జమాత్ అహ్మదియ్యా జగద్గిరిగుట్ట ఆధ్వర్యంలో యౌమ్-ఎ-ఖిలాఫత్ జల్సా ఆదివారం భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో జమాత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.కార్యక్రమం సదర్ సాహిబ్ ముకర్రమ్ షరీఫ్ సాహిబ్ పవిత్ర ఖురఆన్ పారాయణంతో ప్రారంభమైంది. అనంతరం ముకర్రమ్ అబ్దుల్ వహీద్ ఖాన్ సాహిబ్, మురబ్బీ సిల్సిలా, ఖిలాఫత్ పట్ల విశ్వాస ప్రతిజ్ఞ (అహ్దే-ఎ-వఫా బిల్-ఖిలాఫత్)ను పునరుద్ధరింపజేశారు. ఈ సందర్భంగా ముకర్రమ్ హాఫిజుద్దీన్ సాహిబ్ ఖిలాఫత్ ఆశీర్వాదాలు, ప్రాముఖ్యతను వివరిస్తూ నజ్మ్‌ను సమర్పించారు.అనంతరం ముకర్రమ్ ఫరీదుద్దీన్ సాహిబ్ "ఖిలాఫత్-ఎ-ఖామిసా యొక్క ఆశీర్వాద యుగం" అనే అంశంపై ప్రసంగిస్తూ, ఖిలాఫత్ నాయకత్వంలో జమాత్ ప్రపంచవ్యాప్తంగా సాధిస్తున్న ఆధ్యాత్మిక, నైతిక పురోగతిని వివరించారు.మరొక ప్రసంగంలో ముకర్రమ్ అబ్దుల్ వహీద్ ఖాన్ సాహిబ్ మాట్లాడుతూ, ఖిలాఫత్‌తో దృఢమైన అనుబంధాన్ని కొనసాగించడం ప్రతి అహ్మదీ ముస్లిం బాధ్యత అని పేర్కొన్నారు. కాలంలోని ఖలీఫా మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ జీవితంలోని ప్రతి రంగంలో విజయాన్ని సాధించాలని ఆయన సూచించారు.అధ్యక్ష ఉపన్యాసం అనంతరం ప్రత్యేక మౌన ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమం మొత్తం ప్రశాంతమైన, క్రమశిక్షణతో కూడిన మరియు ఆధ్యాత్మికంగా స్ఫూర్తిదాయకమైన వాతావరణంలో కొనసాగింది. జల్సా ముగిసిన అనంతరం హాజరైన సభ్యులందరికీ టీ, అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు పరస్పరం కలుసుకొని సోదరభావాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అల్లాహ్ తఆలా మనందరికీ ఖిలాఫత్ యొక్క ప్రాముఖ్యతను పూర్తిగా అర్థం చేసుకొని, జీవితాంతం ఈ దైవిక వ్యవస్థతో అనుబంధాన్ని కొనసాగించే తౌఫీక్ ప్రసాదించాలని ప్రార్థించారు.

# మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా "ప్రతిభ పురస్కారం" కార్యక్రమం

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదవ తరగతి ఫలితాలలో మహబూబాబాద్ జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులతో పాటు తమ తమ పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన ప్రైవేట్, ప్రభుత్వ రెసిడెన్షియల్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులను సన్మానిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "ప్రతిభ పురస్కారం" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

అసోసియేషన్ అధ్యక్షుడు గండు మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గండు మురళి మాట్లాడుతూ, ప్రైవేట్ టీచర్ల సంక్షేమమే అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని, పరస్పర సహకారం, ఐక్యతతో సంస్థ నిరంతరం అభివృద్ధి చెందుతూ అవసరమైన సమయంలో ఉపాధ్యాయులకు ఆర్థిక సహాయం కూడా అందిస్తోందని తెలిపారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతోనే ప్రతిభా పురస్కార ప్రధాన ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

ముఖ్య అతిథి జ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులు ఒక విజయాన్ని సాధించిన తర్వాత అక్కడితో ఆగిపోకుండా మరింత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన 24వ వార్డు కౌన్సిలర్ దిలీప్ మాట్లాడుతూ, పదవ తరగతి అనంతరం విద్యలో పోటీ తీవ్రంగా ఉంటుందని, అయితే నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసంతో ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని కోరారు.శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ మదార్ మాట్లాడుతూ, లక్ష్యసాధనలో ఎదురయ్యే ఒడిదుడుకులకు భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మార్గదర్శకత్వంలో తమ కలలను సాకారం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సమాజంలోని మార్పులు, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిని అవగాహన చేసుకుని వాటిని తమ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీస్ గురుకులాలు, మహాత్మ జ్యోతిబా




పూలే గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మరియు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన మొత్తం 15 మంది జిల్లా మరియు పాఠశాల టాపర్లను పూల బొకేలు, శాలువాలు, మెమెంటో, ప్రశంసా పత్రములతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు వెంకన్న, ఎం. రాంబాబు, ఎండి సలీం, డి. సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు మైనారిటీ పాఠశాల ఉపాధ్యాయుడు ఇమాముద్దీన్ మొహమ్మద్ పాల్గొన్నారు. ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

# ముప్పారం తాటి వనంలో భారీ అగ్నిప్రమాదం - పైపులు, వైర్లు, గడ్డి వాములు దగ్ధం



ధర్మసాగర్, తెలుగు గళం మే 31: ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలోని తాటి వనం సమీపంలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో పలువురు రైతులకు చెందిన వ్యవసాయ పైపులు, విద్యుత్ వైర్లు, గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి.ఎండల తీవ్రత, పొడి వాతావరణం కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప ప్రాంతాలను చుట్టుముట్టాయి.ఇటీవల పలు వార్తా మాధ్యమాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా వరిగడ్డి, పంట అవశేషాలను కాల్చవద్దని అధికారులు, పర్యావరణ ప్రేమికులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొంతమంది రైతులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని గ్రామస్తులు వెంటనే ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయగా, సీఐ శ్రీధర్‌రావు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సమీపంలోని బావి నుండి పైపుల ద్వారా నీటిని తీసుకువచ్చి, చెట్ల కొమ్మల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. తదనంతరం అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టింది. గ్రామ ఉపసర్పంచ్ తల్లపెల్లి కుమారస్వామి, గీతా కార్మికులు, గ్రామ పరిశుభ్రత కార్మికులు,గ్రామస్థులు కలిసి సహాయక చర్యల్లో పాల్గొని మంటలు మరింత వ్యాపించకుండా కృషి చేశారు. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరట



కలిగించినప్పటికీ, వ్యవసాయ సామగ్రి, గడ్డి వాములు, పైపులు, వైర్లు దగ్ధం కావడంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. పంట అవశేషాలు, వరిగడ్డిని బహిరంగ ప్రదేశాల్లో కాల్చడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గ్రామస్తులు కూడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఎంజీఎన్ఆర్ఈజీఏ పునరుద్ధరణకు ఉద్యమ బాట

## జూన్ 23న కలెక్టరేట్ల ముట్టడి

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 31

వరంగల్ జిల్లా:పర్వతగిరి, కేంద్ర ప్రభుత్వం తక్షణమే వికసిత్ భారత్ రోజ్గార్ మరియు ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం – వీబీజీ రామ్‌జీని రద్దుచేసి చారిత్రాత్మకమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని – ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ డిమాండ్ చేసింది. ఏపీలోని ఒంగోలులో మే 28 నుంచి 30 వరకు జరిగిన బీకేఎంయూ జాతీయ సమితి సమావేశాల్లో ఈ మేరకు తీర్మానించినట్లు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు శనివారం పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.ఉద్యమ కార్యాచరణ: జూన్ 15 నుంచి 20 వరకు గ్రామ స్థాయిలో కార్మికులకు అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, జూన్ 23న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించి ప్రధానమంత్రికి జిల్లా కలెక్టర్ల ద్వారా వినతిపత్రాలు పంపించాలని సమావేశం పిలుపునిచ్చిందని వెంకట్రాములు వెల్లడించారు.ప్రధాన డిమాండ్లు: యూపీఏ హయాంలో గ్రామీణ కార్మికుల హక్కుగా వచ్చిన ఎంజీఎన్ఆర్ఈజీఏను మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేసి, 2026 జులై 1 నుంచి వీబీజీ రామ్‌జీని అమలు చేస్తామనడం దుర్మార్గమన్నారు. కార్మికులకు చట్టబద్ధంగా ఉన్న హక్కు తీసేసి సంక్షేమ కార్యక్రమంగా మార్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

1.ఎంజీఎన్ఆర్ఈజీఏను పునరుద్ధరించి బలోపేతం చేయాలి.

2.నమోదైన ప్రతి కార్మికుడికి 200 రోజులు పని, రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలి.

3.వేతనాలు సకాలంలో చెల్లించాలి, గ్రామ సభల అధికారాలు పునరుద్ధరించాలి.

4.డిజిటల్, బయోమెట్రిక్ షరతులు తొలగించాలి.

5.వ్యవసాయ కార్మికుల పెన్షన్ నెలకు రూ.6 వేలకు పెంచాలి.



6.పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, సాగు భూములు పంపిణీ చేయాలి.ఈ డిమాండ్ల సాధనకు వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొని కేంద్ర పాలకులపై సమర శంఖం పూరించాలని జాతీయ సమితి పిలుపునిచ్చిందని వెంకట్రాములు తెలిపారు.

# బి.వి.రాఘవులకు

## రైతాంగ సమస్యలపై మొర

తల్లాడ, మే 31 (తెలుగుగళం) న్యూస్: ఆదివారం ఖమ్మం జిల్లా తల్లాడ మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామం వచ్చిన సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు ను మాజీ జెడ్పీటీసీ తాతా భాస్కరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు మరియు రైతులు కలిశారు. తమ ప్రాంతంలోని రైతాంగ సమస్యలను బి.వి. రాఘవులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వాటిని ఓపికగా విని సంబంధిత స్థాయిలో గల అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో: రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, బండి రమేష్ తదితర నేతలు పాల్గొన్నారు.



# కాల్వ వడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని వెంటనే ప్రతిష్ట చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వి. హనుమంతరావు నిరసన





తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 01, ఖమ్మం జిల్లా : మే 21 రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు ముందే 20వ తారీకు రాజీవ్ గాంధీ విగ్రహం తీసివేయడం జరిగింది ఈ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ నేషనల్ ప్రెసిడెంట్ శ్రీ మల్లికార్జున గార్గే ఆవిష్కరణ మరియు వి హనుమంతరావు గారు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఖమ్మం నగరంలోని కాలు ఒడ్డు ఖమ్మం రాజీవ్ గాంధీ విగ్రహం తీయడం జరిగింది అది ఎక్కడ పెట్టారో తెలియదు దాని గురించి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా ఇలాంటి విషయాలు తెలియనియకపోవడం శోచనీయంగా అనిపిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో లిఐఎస్టీయూ జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు, తాళ్లూరి హనుమంతరావు పి సీసీ జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ యాదవ్ బోడపట్ల జానయ్య సెక్రెటరీ గురువయ్య, నాయకులు భద్రం కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# అప్పుల బాధతో మహిళ ఆత్మహత్యాయత్నం

## చికిత్స పొందుతూ మృతి



ధర్మసాగర్ తెలుగు గళం, మే 31:

అప్పుల బాధ తాళలేక ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందిన విషాద ఘటన ధర్మసాగర్ మండలంలోని దేవునూరు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి భర్త సులుగురి సంపత్ తెలిపిన వివరాల ప్రకారం, దేవునూరు గ్రామానికి చెందిన సులుగురి పూలమ్మ (50) తన భర్తతో కలిసి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుటుంబ అవసరాలు, పిల్లల చదువుల కోసం చేసిన అప్పులు పెరగడంతో వాటిని ఎలా తీర్చాలనే ఆందోళనతో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యింది. భర్త ధైర్యం చెప్పినప్పటికీ అప్పుల భారం నుంచి బయటపడలేమన్న నిరాశతో జీవితంపై విరక్తి చెందింది. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో ఇంటి డాబాపైకి వెళ్లి ప్యారకిట్ అనే పురుగుల మందు తాగింది. అనంతరం జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి చెందిన శివకుమార్, చిరంజీవి సహాయంతో ఆమెను హనుమకొండలోని కాకతీయ కిడ్నీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మే 28న సాయంత్రం బాలసముద్రంలోని చక్రవర్తి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో ఆరోగ్య పరిస్థితి మరింత దిగజారడంతో మే 31న ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఎంజీఎం ఆసుపత్రిలో క్యాజువాలిటీ వైద్యులు పరీక్షించి ఉదయం 9:14 గంటలకు ఆమె మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతురాలి మరణంపై ఎవరి పట్లనూ అనుమానం లేదని భర్త సులుగురి సంపత్ పోలీసులకు తెలిపాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తమకు అప్పగించాలని పోలీసులను కోరాడు.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## □ హౌజ్ బుజుర్గ్ గ్రామ సర్పంచ్ సయ్యద్ మౌలా

తెలుగు గళం న్యూస్ ఆత్మకూరు మే 31



ఆత్మకూరు మండల హౌజ్ బుజుర్గు గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని స్థానిక గ్రామ సర్పంచ్ సయ్యద్ మౌలా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను, రైతులకు కల్పిస్తున్న వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సర్పంచ్ సయ్యద్ మౌలా మాట్లాడుతూ... రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అయితే వర్షాల ముప్పు పొంచి ఉన్నందున అధికారులు, నిర్వాహకులు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కోరారు. రాబోయే జూన్ 4వ తేదీ నాటికి గ్రామంలోని ధాన్యం కొనుగోళ్లన్నింటినీ పూర్తి చేయాలని ఆయన అధికారులకు, ఐకేపీ సిబ్బందికి సూచించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, తూకాల్లో తేడాలు లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఇంచార్జి షరీఫ్ గ్రామ డీలర్ ఇంచార్జి కరీం మరియు స్థానిక నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# బావిలో దూకి మహిళ ఆత్మహత్య

## రేగొండ మండలం మడతపల్లిలో విషాదం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ



తీవ్ర అనారోగ్య సమస్యలను భరించలేక ఓ వివాహిత బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న విచారకర సంఘటన రేగొండ మండల పరిధిలోని మడదపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, రక్షకభట శాఖ (పోలీసుల) కథనం ప్రకారం.. మడతపల్లి గ్రామానికి చెందిన మోటబోతుల సులోచన (40) అనే మహిళకు గత నాలుగు సంవత్సరాలుగా తీవ్రమైన నడుము నొప్పి, మెడ నొప్పి సమస్యలు ఉన్నాయి.వివిధ ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆమె తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లారు. మధ్యాహ్నం అవుతున్నా సులోచన ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త కొమురయ్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఊరి పరిసరాల్లో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామ శివారుల్లో వెతుకుతుండగా, మడతపల్లి గ్రామ పరిధిలోని గోల్లేనా రవి అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో ఉన్న బావిలో సులోచన మృతదేహం తేలి ఉండటాన్ని గ్రామస్తులు గమనించారు. కళ్లముందే భార్య అచేతనంగా పడి ఉండటం చూసి భర్త కొమురయ్య కన్నీరుమున్నీరుగా రోదించాడు. ఈ దారుణ సంఘటనపై సమాచారం అందుకున్న వెంటనే రేగొండ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) డి. సుధాకర్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని బావిలో నుండి వెలికితీయించి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. మృతురాలి భర్త కొమురయ్య పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. గత కొన్నేళ్లుగా వేధిస్తున్న ఆరోగ్య సమస్యలు తట్టుకోలేకనే తన భర్త మనస్తాపంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని ప్రాథమికంగా వెల్లడించారు. భర్త ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు రేగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని, శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ డి.సుధాకర్ పత్రికా ముఖంగా తెలిపారు. సులోచన మరణంతో మడతపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# అనుమతి లేకుండ ఇహెచ్ఎస్ కటింగ్ ఎలా చేస్తారు?

## సిఎం, డిప్యూటీ సిఎం జోక్యం చేసుకొని కోతలను రద్దు చేయాలి. -టి యు ఎం హెచ్ ఇ యు డిమాండ్

హైదరాబాద్,మే 31 (తెలుగు గళం) న్యూస్:

ఉద్యోగుల ఆరోగ్య పథకం విధి విధానాలు ఖరారు చేయకుండానే, ఉద్యోగుల అనుమతి తీసుకోకుండ గుట్టుచప్పుడుగా మే నెల వేతనంలో ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కు బేసిక్ నుండి 1.5% డబ్బులను కట్ చేయడాన్ని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ లు మీడియాతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ ఆదేశిక సూత్రాల ప్రకారం భారత పౌరులందరికీ నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వాలది, కానీ దానికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల నుండి 1.5% వేతనాన్ని మినహాయించుకుని వైద్య ఆరోగ్య సేవలు అందిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు, హాస్పిటల్స్ తో ఒప్పందం చేసుకోకుండానే, ప్యాకేజి రేట్లు నిర్ణయించకుండానే, ఈహెచ్ఎస్ చందా 1.5% మినహాయింపు పై జిఒ ఇవ్వకుండ ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో 1.5% కోత విధించటాన్ని ఖండిస్తున్నాము. ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఉన్న సందేహాలను నివృత్తి చేయకుండ రాష్ట్ర ప్రభుత్వం గుట్టు చప్పుడుగా మే నెల వేతనంలో కోత పెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది, గత నిబంధనల ప్రకారం భార్యా భర్తలు ఇద్దరు ఉద్యోగులు అయితే ఒక్కరే చందా చెల్లించాలని స్పష్టంగా ఉన్నా ఇప్పుడు ఇద్దరి నుండి చందాను మినహాయించడం అత్యంత దుర్మార్గం అని ఇది ప్రభుత్వానికి తగదన్నారు, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగుల మినహాయింపులు ఎటు దారి మల్లుతున్నాయో అర్ధంకాక ఆవేదన చెందుతున్నారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు 2023 జూలై నుండి రావలసిన పిఆర్సిని ఇవ్వకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా,ఐదు డి ఏ లు ఇవ్వకుండా ప్రభుత్వం కల్లి బొల్లి మాటలతో కాలయాపన చేస్తూ మోసం చేస్తుందని ఇది ఈ ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు.ఆర్థిక శాఖ అత్యుత్సాహంగా తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆబాసు పాలవుతుందన్నారు.



రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖ మంత్రి వెంటనే జోక్యం చేసుకొని ఈ హెచ్ ఎస్ కోతలను నిలిపివేసి పూర్తి వేతనాన్ని రేపు జమ చేయాలని లేనియెడల ప్రత్యక్ష పోరాటాలు చేయవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కుర్ణవల్లి లో శీలం చిన్నమ్మకి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

తల్లాడ,మే 31 (తెలుగుగళం) న్యూస్: ఖమ్మంజిల్లా తల్లాడ మండల పరిధిలోని కుర్ణవల్లి గ్రామానికి చెందిన సీపీఎం నేత శీలం సత్యనారాయణరెడ్డి మాతృమూర్తి శీలం చిన్నమ్మ ఇటీవల మరణించగా అట్టి విషయం తెలుసుకున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యాన్ని కల్పించారు.

ఈ కార్యక్రమంలో: బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉద్యోగుల వేతనాల్లో కోతను తీవ్రంగా ఖండించిన టిఎస్ యుటిఎఫ్

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే 31




ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు కాలేదు. హాస్పిటల్స్ తో ఒప్పందం కుదిరింది లేదు. ప్యాకేజి రేట్లు నిర్ణయించలేదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనే లేదు. ఈహెచ్ఎస్ చందా 1.5% మినహాయింపు పై జిఒ ఇవ్వనే లేదు.కానీ ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల మూల వేతనాల్లో 1.5% కోత విధించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జనగామ జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ తీవ్రంగా ఖండించారు. స్టేషన్ ఘనపూర్ లో విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాల గురించి అడిగితే ఆరోగ్య శాఖ ఇస్తుందని సమాధానం చెప్పిన ఆర్థిక శాఖ అధికారులు ఆ విధివిధానాలు లేకుండానే వేతనాల్లో కోత ఎలా పెడతారని ప్రశ్నించారు. ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాలు ఐఎఫ్ఎంఐఎస్ సైట్ లో ఈరోజు వరకు నమోదు చేయాలని గడువు విధించి, నిన్నటిదాకా వెబ్ సైట్ లో మార్పులు చేస్తూనే ఉన్నారని వివరాలు పూర్తిగా తీసుకోలేదని పాత నిబంధనల ప్రకారం భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒక్కరే చందా చెల్లించాల్సి ఉండగా ఇప్పుడు ఇద్దరి నుంచి మినహాయించారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆధారిత కుటుంబ సభ్యులపై స్పష్టత రాలేదని నిజానికి ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే కానీ కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం ఖరీదైన సమయంలో ఉద్యోగులు కూడా కొంత భరించాలని ప్రభుత్వం కోరినప్పుడు సంఘాలు అంగీకరించాయని తెలిపారు. అయినా వేతనంలో 1.5% కోత నిర్ణయం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని వారిలో ఉన్న సందేహాలను తొలగించి ఆరోగ్య పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాల్సిన సమయంలో అందుకు తగిన చర్యలు తీసుకోకుండా ఇంత హడావుడిగా వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల్లో పలు అనుమానాలకు తావిస్తున్నదని ఆయన విమర్శించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నియంతృత్వ నిర్ణయాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతుందని జయప్రకాశ్ హెచ్చరించారు.

## పౌర్ణమి రోజు గోదావరి మాత నదిహారతి

### పురోహితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా నది హారతి





తెలుగు గళం న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం

అధిక జేష్ట మాసం విభువన సంకష్టహర చతుర్థి పౌర్ణమి రోజు గోదావరి మాత నదిహారతి పురోహితుల మంత్రోచ్ఛారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని రామ వజ్జల రవికుమార్ అన్నారు.

శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో ప్రతి ఆదివారం గోదావరి నదికి భక్తుల సహాయ సహకారాలతో భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు. విభూవన సంకష్టహర చతుర్థి పౌర్ణమి ఆదివారం రోజు నిర్వహించే నదిహారతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పురోహితులు గోదావరి హారతి విశేషాలను విశిష్టతను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులుశ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన అనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామానుగ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, రామాచారి అండ్ సన్స్ ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం నైవేద్యం భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, పూజా ద్రవ్యాలు భద్రాచలం రెడీమేడ్ షాప్ సంఘం ఆధ్వర్యంలో అందజేయడం జరిగిందని ఆయన అన్నారు.

## అగ్నివీర్‌గా గౌరారం యువకుడి ఎంపిక

## అభినందించిన సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, మే 31: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం గౌరారం గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీకాంత్ భారత సైన్యంలో అగ్నివీర్‌గా ఎంపికై గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. కఠిన శ్రమ, పట్టుదల, అంకితభావంతో చేసిన సన్నాహాల ఫలితంగా ఆయన ఈ అరుదైన విజయాన్ని సాధించారు. శ్రీకాంత్ ఎంపిక పట్ల గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంత్ రావు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించి ఉన్నత స్థానాలను అధిరోహించాలని సూచించారు. శ్రీకాంత్‌ను ఆదర్శంగా తీసుకుని మరింత మంది యువకులు దేశ సేవకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, యువత కూడా శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. దేశ సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప విషయమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి,

# ప్రైమరీ పి.ఎం. శ్రీ విద్యను అంగన్వాడీలకే ఇవ్వాలి

### కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి- సుంచు విజేందర్

తెలుగు గళం న్యూస్ జనగామ, మే 31




అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జనగామ జిల్లా గౌరవ అధ్యక్షులు సుంచు విజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం జనగామలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అంగన్వాడీ టీచర్స్ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుంచు విజేందర్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఏప్రిల్ నెల వేతనాలు ఇప్పటి వరకు అందకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వేతనాలు ఆలస్యమవడంతో ఈఎంఐలు చెల్లించలేక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని కోరారు. ప్రస్తుత ప్రీ ప్రైమరీ విధానం అత్యంత ప్రమాదకరమైందని పేర్కొంటూ, దానిని వెనక్కి తీసుకుని ప్రీ ప్రైమరీ పి.ఎం. శ్రీ విద్యను అంగన్వాడీ కేంద్రాల్లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ గత ఐదు దశాబ్దాలుగా పేద ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ ఇప్పటికీ చట్టబద్ధమైన అనేక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం 2023లో 24 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరవధిక సమ్మె సందర్భంగా, అలాగే అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలుకాలేదని విమర్శించారు. అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం, సమ్మె కాలం వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, మినీ టీచర్స్ ఎరియర్స్, పీఆర్సీ ఎరియర్స్ తదితర పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఇటీవల అందించిన సెల్‌ఫోన్లు సరిగా పనిచేయకపోవడంతో వాటి స్థానంలో అన్ని యాప్‌లు పనిచేసే 5జీ నెట్‌వర్క్ ఫోన్లు అందించాలని కోరారు. అంగన్వాడీ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ సమస్యలన్నింటినీ ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బైరగోని అంజమ్, జిల్లా సహాయ కార్యదర్శులు బి. బిక్షం, ఎర్రబెల్లి సంతోష, నాయకులు నల్ల నిర్మల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

# కందుకూరు లో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

### ఐల్లమ్మ పుట్టిన జిల్లాకు ఐల్లమ్మ పేరు పెట్టాలి: రాయల సత్యనారాయణ (వెంకటేశ్వరస్వామి దేవాలయ మాజీ చైర్మన్)





వేంసూరు, మే 31(తెలుగు గళం): ఖమ్మంజిల్లా వేంసూరు మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో ఆదివారం వీర తెలంగాణ సాయుధ పోరాట వీర నారీమణి చిట్యాల(చాకలి) ఐలమ్మ విగ్రహాన్ని అంగరంగ వైభవంగా ఆవిష్కరించారు. గ్రామంలో గల స్వయంభూ శ్రీ మీసాల వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీ చైర్మన్ రాయల సత్యనారాయణ రజక కులస్తులను,అన్ని సామాజిక వర్గాల ప్రజలను రాజకీయాల కతీతంగా కలుపుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు.

దొరల పెత్తందారీకి, నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలబడి "అన్యాయానికి తలవంచేది లేదు" అని చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్న మహావీరనారి చాకలి ఐలమ్మ అని రాయల సత్యనారాయణ తెలిపారు. తన కుటుంబం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా, తన పోరాటాన్ని ఆపకుండా బదుగు,బలహీన వర్గాలకు ఆత్మవిశ్వాసాన్ని నింపి, అణగారిన ప్రజల హక్కుల కోసం చివరి వరకు పోరాడిన యోధురాలు ఐలమ్మ అని ఆమె జీవితం ఆదర్శ ప్రాయమని తెలిపారు.

తెలంగాణ ఉద్యమం నుంచి నేటి సామాజిక న్యాయ పోరాటాల వరకు ప్రతి అడుగులోనూ చాకలి ఐలమ్మ స్ఫూర్తి కనిపిస్తుందన్నారు అందుకే ఆమెను కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకుండా తెలంగాణ జాతి గర్వంగా గుర్తించాలనీ రజక జాతికి వన్నె తెచ్చిందినని సత్యనారాయణ కీర్తించారు.

ప్రభుత్వం చాకలి ఐలమ్మ సేవలను గుర్తించి, ఆమె పేరును ఆమె జన్మించిన జిల్లాకు నామకరణం చేయాలని, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆమె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాయల డిమాండ్ చేసారు. గ్రామ గ్రామాన చాకలి ఐలమ్మ విగ్రహాలు నెలకొల్పి యువతకు ఆమె పోరాట చరిత్రను తెలియజేయాలన్నారు.

నేటి యువత చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ, త్యాగస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు

ఈ కార్యక్రమంలో: బానోతు విజయ్ ,డాక్టర్ పెద్దిరాజు , మంద శివ, కోమటి తిరుమలరావు, రజక సంఘం మండల అధ్యక్షులు తాళ్లూరి రామారావు, రాయల రిషి, రాయల వెంకటేశ్వరావు, పాలకొల్లు శ్రీనివాస్ రావు, ఎదుళ్ళ మురళి, రవికుమార్, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# బస్సు ఆపలేదని డ్రైవర్‌పై దాడి అన్నారంలో యువకుల వీరంగం

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి, మే/ 31




వరంగల్ జిల్లా: పర్వతగిరి నుంచి తొర్రూర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పెద్దతండ వద్ద ఆపలేదన్న కారణంతో యువకులు అన్నారం గ్రామ శివారులో డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు.ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పర్వతగిరి నుంచి తొర్రూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెద్దతండ వద్ద స్టేజీ ఉన్నప్పటికీ ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో ఆగ్రహించిన పెద్దతండ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై బస్సును వెంబడించారు. అన్నారం షరీఫ్ దర్గా బస్టాప్ వద్దకు చేరుకోగానే బైక్‌ను బస్సుకు అడ్డుపెట్టి నిలిపివేశారు.అనంతరం బస్సు ఎక్కి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. స్టేజీలో ఎందుకు ఆపలేదంటూ దుర్భాషలాడుతూ డ్రైవర్‌పై చేయి చేసుకున్నారు. పిడిగుద్దులు గుద్ది గాయపరిచారు. దీంతో బస్సులోని ప్రయాణికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు జోక్యం చేసుకుని యువకులను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పర్వతగిరి ఎస్ఐ తెలిపారు. నిందితులను త్వరలో అదుపులోకి తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ సిబ్బంది ఆగ్రహం విధి నిర్వహణలో ఉన్న డ్రైవర్లపై దాడులు చేయడం సరికాదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ సిబ్బంది డిమాండ్ చేశారు.ప్రయాణికుల భద్రతకు విఘాతం కలిగించే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

# మధిర మున్సిపల్ చైర్మన్ ను సత్కరించిన జర్నలిస్టు మల్లూరు

### ●ప్రజా అభివృద్ధి లో ముందుకు సాగాలి ●బాల్య స్నేహం మరువలేనిది




వేంసూరు, మే 31(తెలుగు గళం) న్యూస్: ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గ కేంద్రం మున్సిపాలిటీ చైర్మన్ సామినేని సుజాత రామనాథం లను జర్నలిస్టు, సీఐటీయూ నేత,ఎస్ బి ఐ లైఫ్ మిత్ర మల్లూరు చంద్రశేఖర్ శాలువా కప్పి సత్కరించారు. మధిర మున్సిపాల్టీ పరిధిలోని ఇల్లెందలపాడు గ్రామంలో గల చైర్మన్ స్వగృహంలో మల్లూరు కలసి సుజాత ను మున్సిపాల్టీ చైర్మన్ గా విజయం సాధించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా అభివృద్ధి లో రాజకీయాలకతీతంగా ముందుకు సాగాలని మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలకు ఉత్తమ సేవకురాలిగా పని చేసి ప్రజా అభిమానాన్ని చురగొనాలని 2031 లో జరగనున్న మున్సిపాల్టీ ఎన్నికలలో మరోసారి ఏకగ్రీవంగా గెలుపొందేదానికి ఇప్పటి నుండే కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మల్లూరు మీడియాతో మాట్లాడుతూ సత్తుపల్లి మండల పరిధిలోని తమ స్వగ్రామం సదాశివునిపాలెం లో సుజాత తను బాల్యం నుండి గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో కలసి చదువుకున్నామని సోదర భావంతో కలిసి మెలిసి ఉన్నామని ఒక తల్లి బిడ్డల లా విద్యార్థి దశలో ఆటలు ఆడుతూ గడిపామని ఇద్దరి ఇండ్లు పక్క పక్కనే ఉండేవని తెలిపారు. మాకు రాజకీయాలు వేరైనా బాల్య స్నేహం జీవితంలో మరువలేనిదని ఎప్పటికీ సోదరీ సోదరులుగా ఉంటామని స్పష్టం చేశారు. చైర్మన్ సుజాత దంపతులను కలిసిన వారిలో మల్లూరు తో పాటు మల్లూరు మిత్రులు తుంగా నాగరాజు, కువ్వారాపు నాగేశ్వరరావు లు వున్నారు.





# ఫీజు చెల్లించలేదని విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపడం చట్టవిరుద్ధం

## తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

తెలంగాణ గళం న్యూస్, పర్వతగిరి / మే 31 :

విద్యా సంస్థలకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఒక ముఖ్యమైన తీర్పును వెలువరించింది. విద్యార్థులు ఫీజులు చెల్లించలేదనే సాకుతో వారి అసలు విద్యా ధృవీకరణ పత్రాలను (ఒరిజినల్ సర్టిఫికెట్స్ ) విద్యా సంస్థలు తమ వద్దే ఉంచుకోకూడదని కోర్టు స్పష్టం చేసింది.ఒక విద్యార్థి ఫీజు బకాయి పడ్డాడనే కారణంతో ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం అతని ఒరిజినల్ సర్టిఫికెట్లను తిరిగి ఇచ్చేందుకు నిరాకరించింది. దీనిపై సదరు విద్యార్థి హైకోర్టును ఆశ్రయించగా, జస్టిస్ సి.వి. భాస్కర్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. విద్యా సంస్థలు విద్యార్థుల సర్టిఫికెట్లను కేవలం పరిశీలన (వెరిఫికేషన్ ) కోసం మాత్రమే తీసుకోవాలని, బకాయిల కోసం వాటిని తాకట్టు పెట్టుకునే (లైన్ ) హక్కు విద్యా సంస్థలకు లేదని కోర్టు తేల్చి చెప్పింది. విద్యా ధృవీకరణ పత్రాలు అనేవి విద్యార్థి మేధస్సుకు, చదువుకు సంబంధించినవని, వాటిని ఆర్థిక లావాదేవీల కోసం వాడుకోవడం చెల్లదని ధర్మాసనం పేర్కొంది. ఒకవేళ విద్యార్థులు ఫీజు చెల్లించకపోతే, ఆ బకాయిలను వసూలు చేసుకోవడానికి చట్టపరమైన ఇతర మార్గాలను (సివిల్ కోర్టుల ద్వారా) అనుసరించాలే తప్ప, వారి భవిష్యత్తును దెబ్బతీసేలా సర్టిఫికెట్లను ఆపకూడదని హెచ్చరించింది. పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థికి సంబంధించిన సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని సదరు విద్యా సంస్థను కోర్టు ఆదేశించింది. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పు రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులకు పెద్ద ఊరటనిస్తోంది. ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఫీజుల పేరుతో సర్టిఫికెట్లను బ్లాక్ మెయిల్ అస్త్రంగా వాడుకుంటున్న తరుణంలో ఈ తీర్పు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

భార్య తన భర్త ఆదాయపు పన్ను వివరాలను ఆర్ టి ఐ కింద పొందలేరు: ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు భార్యాభర్తల మధ్య నడుస్తున్న మెయింటెనెన్స్ కేసుల విచారణలో ఢిల్లీ హైకోర్టు ఒక కీలకమైన మరియు చారిత్రాత్మక తీర్పును వెలువరించింది.




మెయింటెనెన్స్ క్లెయిమ్ (జీవనభృతి) కోసం భార్య తన భర్త యొక్క ఆదాయపు పన్ను వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ యాక్ట్ ) కింద పొందేందుకు వీల్లేదని కోర్టు స్పష్టం చేసింది. ఒక వ్యక్తి యొక్క ఆదాయపు పన్ను రిటర్నులు అనేవి పూర్తిగా వారి "వ్యక్తిగత సమాచారం" (పర్సనల్ ఇన్ఫర్మేషన్ ) పరిధిలోకి వస్తాయని, కాబట్టి వాటిని బహిర్గతం చేయలేమని న్యాయస్థానం తెలిపింది.ఒక వివాహ వివాదంలో భార్య తన భర్త నుండి మెయింటెనెన్స్ పొందేందుకు, అతని ఆర్థిక స్థితిని నిరూపించాలనే ఉద్దేశంతో ఆర్ టి ఐ ద్వారా భర్త ఆదాయపు పన్ను వివరాలను కోరింది. దీనిపై గతంలో స్పందించిన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సిఐసి ), సదరు భర్త యొక్క నికర పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయ వివరాలను భార్యకు అందజేయాలని ఆదాయపు పన్ను శాఖను ఆదేశించింది. ఈ ఆదేశాన్ని సవాలు చేస్తూ భర్త ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ కొట్టివేసింది. ఈ సందర్భంగా కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది: సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(జె) ప్రకారం.. విస్తృతమైన ప్రజా ప్రయోజనం ఉంటే తప్ప, ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని లేదా వారి గోప్యతకు భంగం కలిగించే వివరాలను వెల్లడించకూడదు. ఆదాయపు పన్ను రిటర్నులు పూర్తిగా వ్యక్తిగత సమాచారమే.భార్యాభర్తల మధ్య జరిగే వ్యక్తిగత లేదా వైవాహిక వివాదాలలో భర్త ఆదాయ వివరాలు కోరడం వెనుక ఎలాంటి 'విస్తృత ప్రజా ప్రయోజనం' (లార్జర్ పబ్లిక్ ఇంటరెస్ట్) దాగి లేదు. సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వ సంస్థలలో పారదర్శకత కోసం తీసుకొచ్చారే తప్ప, వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడానికి కాదని కోర్టు స్పష్టం చేసింది. మెయింటెనెన్స్ కేసులలో భర్త ఆదాయ వివరాలను తెలుసుకోవడానికి భార్యకు ఇతర చట్టపరమైన మార్గాలు ఉన్నాయని కోర్టు గుర్తుచేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. మెయింటెనెన్స్ కేసులలో ఇరు పక్షాలు తమ ఆస్తులు, అప్పులు మరియు ఆదాయ వివరాలతో కూడిన అఫిడవిట్లను కోర్టుకు సమర్పించాల్సి ఉంటుంది. కాబట్టి, ఆయా కోర్టుల ద్వారానే చట్టబద్ధంగా వివరాలు పొందాలే తప్ప, ఆర్ టి ఐ ని ఒక షార్ట్‌కట్‌లా వాడకూడదని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ద్వారా వైవాహిక వివాదాల్లో ఆర్ టి ఐ చట్టాన్ని ఉపయోగించి భర్తల ఆర్థిక వివరాలు,బ్యాంక్ స్టేట్‌మెంట్లు సేకరించే ధోరణికి అడ్డుకట్ట పడినట్లయింది.

# ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు సమంజసం కాదు

## 'తపస్' రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ



రాజేంద్రనగర్, తెలుగు గళం న్యూస్ మే/ 31 తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు మదగని బాలకృష్ణ ఉపాధ్యాయుల జీతాల్లో కోతలు విధించడం సమంజసం కాదంటూ ప్రభుత్వ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులకు సంబంధించిన విధివిధానాలను ప్రకటించకుండా, ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి చర్చలు జరపకుండానే ప్రీమియం వసూలు చేయడం పారదర్శకత లోపాన్ని సూచిస్తోందని ఆయన విమర్శించారు. అధికారికంగా కార్డులు జారీ చేయకుండా, పథకంపై పూర్తి సమాచారం ఇవ్వకుండానే జీతాల్లో ముందస్తుగా కోతలు విధించడం ఉపాధ్యాయులను మోసగించడమేనని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వానికి వారు పలు ప్రధాన డిమాండ్లను సమర్పించారు. ఇప్పటివరకు వసూలు చేసిన ప్రీమియం మొత్తాన్ని ఉపాధ్యాయులకు తిరిగి చెల్లించాలని, పూర్తి విధివిధానాలు స్పష్టం చేసి కార్డులు జారీ చేసిన తర్వాతే మళ్లీ కోతలు చేపట్టాలని కోరారు. అలాగే, ఈ హెల్త్ కార్డు పథకం ఇష్టం లేని వారికి దాని నుండి మినహాయింపు పొందే స్వేచ్ఛా ఎంపికను కల్పించాలని డిమాండ్ చేశారు. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులైన పక్షంలో ఒకరి జీతం నుండే ప్రీమియం వసూలు చేయాలని, యువతీ యువకులకు కూడా ఈ పథకం వర్తించేలా డిపెండెంట్ల వయోపరిమితిని 25 నుండి 35 సంవత్సరాలకు పెంచాలని సూచించారు. వీటితో పాటు, సీనియర్, జూనియర్ అనే వ్యత్యాసాలు లేకుండా అందరికీ సమానంగా ఒకే రకమైన ప్రీమియం విధానాన్ని అమలు చేయాలని మదగని బాలకృష్ణ డిమాండ్ చేశారు.

# బీఆర్ఎస్ కార్యకర్త తల్లి దశదిన కార్యక్రమంలో పాల్గొన్న నేతలు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి, మే/ 31



వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బార్ల రాజశేఖర్ మాతృమూర్తి కీ.శే. రామలక్ష్మి ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా బార్ల రాజశేఖర్ కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం దశదిన కార్యక్రమంలో పాల్గొని కీ.శే. రామలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రంగు కుమార్ గౌడ్, మాజీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, మాజీ రైతుబంధు మండల అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బొట్ల కిష్టయ్య,సీనియర్ నాయకులు జంగిలి బాబు,బొట్ల మధు,కందికట్ల ప్రవీణ్, గోగుల బాబు,రాపాక మధు, బీఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బొట్ల భాస్కర్, యాసారపు సురేష్, పసుల శీను,బోట్ల చిన్న వెంకటేశ్వర్లు, మహమ్మద్ రఫీ, బార్ల హరీష్, రాపాక రాజశేఖర్, వల్లందాస్ లక్ష్మయ్య, దబ్బటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

## మాజీ మంత్రి బోడ జనార్ధన్ డిమాండ్



తెలంగాణలో రైతులు పండించిన ప్రతి గింజను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రైతన్నలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని మాజీ మంత్రి, తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు బోడ జనార్ధన్ హెచ్చరించారు. కమీషన్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతూ రైతుల జీవితాలను బలి పెడుతున్నాయని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో ఈ సీజన్‌లో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే, అందులో ఇప్పటివరకు సగం కూడా కొనుగోలు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. మంత్రులు కమీషన్ల కక్కుర్తితోనే ధాన్యం కొనడం లేదని ఒకరు, మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువే కొన్నామని మరొకరు పరస్పర విమర్శలు చేసుకుంటూ సంబరపడుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, తడిసిన ధాన్యం అమ్ముడుపోక పంటను తగలబెడుతూ ప్రభుత్వాలను శపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల సంఖ్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నాయని, గోనె సంచుల కొరత, గిడ్డంగి (గౌడౌన్ల) సమస్యలు, రవాణా ఇబ్బందులను అసలు పట్టించుకోవడమే లేదని విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు రైస్ మిల్లర్లు, దళారులతో కుమ్మక్కై 50 కిలోల బస్తాలో 5 కిలోల చొప్పున తరుగు పేరుతో కటింగ్ చేస్తూ రైతులను దారుణంగా మోసం చేస్తున్నారని బోడ జనార్ధన్ ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన టార్గెట్ పూర్తయిందని చేతులు నడుపుకోకుండా, ఇంకా సగానికి పైగా మిగిలి ఉన్న ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే బాధ్యతగా కొనాలని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతన్నలకు అన్యాయం జరగనివ్వద్దని, వారికి మద్దతుగా ప్రభుత్వాల మెడలు వంచి పోరాడాలని తమ నాయకురాలు కవిత స్పష్టమైన పిలుపునిచ్చారని ఆయన గుర్తు చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను పెంచి, ధాన్య సేకరణను వేగవంతం చేయకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉధృత పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు మంచాల వరలక్ష్మి, గొంగళ్ల రంజిత్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొని రైతులకు మద్దతుగా నిలిచారు.

# రెండో టీ20లో భారత్‌పై ఇంగ్లండ్ విజయం




స్పోర్ట్స్ న్యూస్, తెలుగు గళం న్యూస్ మే/ 31 బ్రిస్టల్ వేదికగా శనివారం జరిగిన రెండో మహిళల టీ20 మ్యాచ్‌లో ఇంగ్లండ్ 26 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 1-1తో సమం చేసింది. తొలి మ్యాచ్‌లో భారత్ 38 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. ఓపెనర్లు డాని వైట్-హాడ్జ్, సోఫియా డంక్లీ జట్టుకు శుభారంభం అందించగా, చివర్లో ఫ్రేయా కెంప్ కేవలం 13 బంతుల్లో 39 పరుగులు చేసి స్కోరును భారీ స్థాయికి చేర్చింది. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 142 పరుగులకే పరిమితమైంది. యస్తికా భాటియా 33 పరుగులతో పోరాడినా, ఇతర బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు.

ఇంగ్లండ్ బౌలర్లలో ఫ్రేయా కెంప్ 2 వికెట్లు తీసి భారత బ్యాటింగ్‌ను దెబ్బతీయగా, చార్లీ డీన్, లారెన్ బెల్ కూడా కీలక వికెట్లు సాధించారు. ఇటు బ్యాటింగులోను, అటు బౌలింగులోనూ రాణించిన ఫ్రేయా కెంప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇక సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే చివరి టీ20 మ్యాచ్ జూన్ 2న టాంటన్‌లో జరగనుంది. భారత్, ఇంగ్లండ్ జట్లు సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ఆ మ్యాచ్‌లో తలపడనున్నాయి.

# ఫైనల్లో సాత్విక్-చిరాగ్




స్పోర్ట్స్ న్యూస్, తెలుగు గళం న్యూస్ మే/ 31 భారత డబుల్స్ స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్ -చిరాగ్ శెట్టి మరోసారి అద్భుత ప్రదర్శన చేశారు. సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ వన్, వరల్డ్ చాంపియన్ జోడీకి చెక్ పెడుతూ ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో నాలుగో సీడ్ సాత్విక్-చిరాగ్ 21-19, 21-18 తేడాతో టాప్ సీడ్స్ కిమ్ వోన్ హో- సియో స్యూంగ్ జే (కొరియా)పై వరుస గేమ్స్‌లో విజయం సాధించింది. 52 నిమిషాల హోరాహోరీ పోరులో తొలి గేమ్‌లో విరామ సమయానికి కొరియా జోడీ 13-11 తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. అయితే సాత్విక్-చిరాగ్ వెంటనే తేరుకుని కీలక పాయింట్లు సాధించి తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఇండియా జోడీకి మొదట్లో సవాలు ఎదురైంది. ఒక దశలో 11-14 తో వెనుకబడినా ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఆడి ప్రత్యర్థి పని పట్టింది. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో ధృవ్ కపిల- తనీషా క్రాస్టో 16-21, 21-17, 13-21 తేడాతో యు యిచీ షిమోగామి- సయాకా హోబరా (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది.

# అత్తాపూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ 'మన్ కీ బాత్' కార్యక్రమం

అత్తాపూర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి నెల నిర్వహించే 'మన్ కీ బాత్' ఆదివారం 134వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని అత్తాపూర్‌లోని బూత్ నెంబర్ 235 పరిధిలో గల డివిజన్ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు డాకా కృష్ణవేణి నివాసంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు కలిసి తిలకించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా ఆఫీస్ సెక్రెటరీ సాబాద విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగంలో దేశ హితం కోసం, సమాజ శ్రేయస్సు కోసం దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు చేస్తున్న అద్భుతమైన పనులను కొనియాడారు. ఇటువంటి వారి కథనాలు సమాజానికి ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. ఇటీవల జాతీయ అథ్లెటిక్స్‌లో దేశం సాధించిన అద్భుత ఘనతలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ సమాఖ్య పోటీల్లో దేశవ్యాప్తంగా సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొనగా, నాలుగు వేర్వేరు క్రీడాంశాలలో జాతీయ రికార్డులు బద్దలవడం విశేషమన్నారు. ఈ క్రీడల్లో గురువిందర్ సింగ్, విశాల్ టికే, తేజస్విని శంకర్, దేవ్ మీనా, కుల్దీప్ కుమార్ వంటి ప్రతిభావంతులు వేర్వేరు విభాగాల్లో సరికొత్త రికార్డులు సృష్టించారని ప్రధాని అభినందించారు. ముఖ్యంగా పురుషుల 100 మీటర్ల పరుగు పందెం విభాగంలో కేవలం రెండు రోజుల వ్యవధిలోనే జాతీయ రికార్డు మూడు సార్లు బద్దలైందని, ఈ అద్భుతాన్ని గురువిందర్ వీర్ సింగ్, అనుమేష్ కుజూర్ అనే ఇద్దరు క్రీడాకారులు సుసాధ్యం చేసి చూపించారని ప్రధాని కొనియాడారు. దేశ కీర్తిని పెంచిన ఈ క్రీడాకారులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అత్తాపూర్‌లో జరిగిన ఈ ప్రత్యక్ష ప్రసార వీక్షణ కార్యక్రమంలో డాకా రామ్ రెడ్డి, రవి కిరణ్, యశస్విని, భాగ్యలతో పాటు స్థానిక భారతీయ జనతా పార్టీ నాయకులు, మహిళా మోర్చా ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంకా ఆటపట్టిస్తాడు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్, రామ్ చరణ్ కాంబోలో వచ్చిన సినిమా 'ధృవ' బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. రామ్ చరణ్ కెరీర్‌లోనే ఓ మైలురాయిగా నిలిచిన ఈ చిత్రాన్ని సురేందర్ తెరకెక్కించారు. సమాజంలో జరిగే నేరాలకు, వ్యవస్థలోని లొసుగులకు కారణమైన పవర్ఫుల్ సైంటిస్ట్, బిజినెస్‌బ్యాన్ క్యారెక్టర్‌లో అరవింద్ స్వామిని ఇంటెలిజెంట్ పోలీస్ ఆఫీసర్ రామ్ చరణ్ ఎలా పట్టుకున్నాడనేది ఈ మూవీ స్టోరీ. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ప్రీత్‌సింగ్ ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన పలు విశేషాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై రకుల్ ప్రశంసల జల్లు కురిపించారు. ఇండస్ట్రీలో ఉండే ప్రతి ఒక్కరికీ ఒక డ్రీమ్ హీరో ఉంటాడని, అలాగే తనకు కూడా రామ్ చరణ్‌తో నటించాలనే బలమైన కోరిక ఉండేదని రకుల్ చెప్పారు. ఆ అవకాశం తనకు ఏకంగా రెండు సార్లు రావడం చాలా సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు.

రామ్ చరణ్ అంత పెద్ద గ్లోబల్ స్టార్ అయినప్పటికీ, ఆయనకు ఎలాంటి గర్వం ఉండదని, ఎంతో కల్మషం లేని మంచి మనస్తత్వం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ముఖ్యంగా 'ధృవ' సినిమా కోసం చరణ్ పడిన కష్టం, ఆయన బాడీ మేకోవర్ చూసి తానే ఆశ్చర్యపోయానని రకుల్ గుర్తుచేసుకున్నారు. ఇక ఈ సినిమాలోని సూపర్ హిట్ సాంగ్ 'పరేషానురా' గురించి రకుల్ ఒక ఫన్నీ విషయాన్ని పంచుకున్నారు. ఆ పాటలో తన గ్లామర్, పర్ఫార్మెన్స్ చూసి రామ్ చరణ్ ఫ్యాన్స్ థియేటర్లలో చొక్కాలు చించుకున్నారని.. ఆ సాంగ్‌లో చరణ్ కంటే తనే ఎక్కువగా డామినేట్ చేసేసిందంటూ ఇప్పటికీ చరణ్ తనను సరదాగా ఆటపట్టిస్తుంటారని రకుల్ నవ్వుతూ చెప్పారు. అలాగే ఆ పాటలోని కొన్ని కష్టమైన డ్యాన్స్ మూమెంట్స్ కోసం తాను ఎక్కువ టేకులు తీసుకుని విసిగించినప్పటికీ, రామ్ చరణ్ ఏమాత్రం విసుక్కోకుండా, అంతే ఉత్సాహంతో, ఎంతో ఓపిగ్గా తనతో కలిసి స్టెప్పులు వేశారని చరణ్ గొప్పతనాన్ని రకుల్ ప్రీత్ సింగ్ వివరించారు.



# రెండేళ్లు నరకమే

టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరోలతో కలిసి నటించి స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న హన్సిక కెరీర్ మంచి పీక్స్‌లో ఉన్న సమయంలోనే ఆమె సోహైల్ ఖతూరియాను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరి వైవాహిక జీవితం ఎక్కువ కాలం నిలవలేదు. పెళ్లయిన కొద్ది రోజులకే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. విడాకుల తర్వాత హన్సిక మళ్లీ తన సినీ కెరీర్‌పై పూర్తి ఫోకస్ పెట్టింది. ఇదిలా ఉండగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హన్సిక.. తన వ్యక్తిగత జీవితంలో జరిగిన చేదు సంఘటనలను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యింది. జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలు కొన్నిసార్లు తప్పు అవ్వచ్చని, అలాంటి కఠిన పరిస్థితుల్లో ధైర్యంగా ముందుకు సాగడం చాలా ముఖ్యమని హన్సిక తెలిపింది. దీనికి ఉదాహరణగా చెప్తూ.. "మనం పొరపాటున ఒక తప్పు ట్రైన్ ఎక్కితే, అది చివరి గమ్యస్థానానికి చేరేవరకు అందులోనే కూర్చోవాల్సిన అవసరం లేదు. తదుపరి స్టేషన్ రాగానే దిగిపోవాలి.

మనకు అది సరైన మార్గం కాదని తెలిసిన వెంటనే వెనక్కి వచ్చేయాలి. ఇదే సూత్రం జీవితానికి కూడా వర్తిస్తుంది" అంటూ తన విడాకుల నిర్ణయాన్ని పరోక్షంగా సమర్థించుకుంది. గత రెండేళ్లుగా తాను జీవితంలో అత్యంత కఠినమైన కాలాన్ని గడిపినట్లు హన్సిక ఆవేదన వ్యక్తం చేసింది. ఎప్పుడూ నవ్వుతూ, ఎంతో ఉల్లాసంగా ఉండే తాను మానసికంగా పూర్తిగా మారిపోయానని.. బయటకు నవ్వుతూ కనిపించినా లోపల చాలా బాధ అనుభవించానని నరకం చూశానని చెప్పింది. అంత యాక్టివ్‌గా ఉండే తను ఒక్కసారిగా మౌనంగా మారిపోవడం చూసి తన తల్లి, అన్నయ్య ఎంతో ఆందోళన చెందారని గుర్తుచేసుకుంది. తన మానసిక పరిస్థితి ఇంకా దిగజారకుండా ఉండటానికి కుటుంబ సభ్యులు తనకు అండగా నిలిచారని, వారి సహాయంతోనే తాను థెరపీ కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇక విడాకుల తర్వాత తనపై వచ్చిన విమర్శల గురించి హన్సిక గట్టిగానే స్పందించింది. విడిపోయిన తర్వాత తనపై సోషల్ మీడియాలో, వెబ్‌సైట్లలో అనేక రకాల వార్తలు వచ్చాయని.. చాలామంది అసలు నిజం తెలుసుకోకుండానే తమకు తోచినట్లు మాట్లాడారని మండిపడింది. అయితే వాటిపై స్పందించాల్సిన అవసరం తనకు లేదని తేల్చి చెప్పింది. ప్రజలకు కేవలం సంచలన హెడ్‌లైన్స్, క్లిక్‌బైట్స్ మాత్రమే కావాలని, వాటి కోసమే ఎన్నో కల్పిత కథలు సృష్టించారని విమర్శించింది. తాను ఎప్పుడూ ఎవరికీ వివరణ ఇవ్వలేదని, ఇకముందు కూడా ఇవ్వనని స్పష్టం చేసింది.



# సూపర్ స్టార్ ఫ్యాన్స్‌కు డబుల్ ధమాకా

ఆగస్టు నెల వచ్చిందంటే చాలు సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా మహేష్ బాబు బర్త్‌డేను ప్రత్యేకంగా సెలబ్రేట్ చేయాలని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి సమయంలో వారికి అదిరిపోయే గుడ్ న్యూస్ బయటకు వచ్చింది. మహేష్ బాబు నటించిన రెండు బ్లాక్‌బస్టర్ చిత్రాలను ఆయన పుట్టినరోజు సందర్భంగా రీ-రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు నెలలో ప్రపంచవ్యాప్తంగా 'పోకిరి' చిత్రాన్ని రీ-రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. 2006లో విడుదలైన ఈ సినిమా ఇండస్ట్రీ హిట్‌గా నిలిచి భారీ సంచలనం సృష్టించింది. అలాగే మహేష్ నటించిన మరో బ్లాక్‌బస్టర్ మూవీ 'దూకుడు'ను ఆగస్టు 7వ తేదీన రీ-రిలీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. 2011లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఎన్నో కొత్త రికార్డులను సృష్టించింది. ఇలా మహేష్ కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఈ రెండు సూపర్ హిట్ చిత్రాలు మరోసారి థియేటర్లలో సందడి చేయనున్నాయి. రీ-రిలీజ్ సందర్భంగా ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సునామీ సృష్టిస్తాయనే అంశం ప్రస్తుతం ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.